క్లుప్తంగా

మీడియా స్వేచ్ఛను హరించడం అన్యాయం



అచ్చంపేట: వైఎస్సార్ జిల్లా, పులివెందుల నియోజకవర్గంలోని వేమలలో సాగునీటి సంఘ ఎన్నికలపై మీడియా కవరేజ్‌కు వెళ్లిన సాక్షి బృందంపై దాడి చేసి గాయపరచడం దారుణమని, ఇది ముమ్మాటికి మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గవ మూల స్తంభంగా పిలువబడే మీడియాకే రక్షణ లేనప్పుడు ప్రజాస్వామ్యం ఎక్కుడుందని ఆయన ప్రశ్నించారు. దోషులు ఎంతటి వారైనా తక్షణమే అరెస్ట్ చేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ముప్పాళ్ల: మండలంలోని గుంటూరు బ్రాంచి కాలువ లాకుల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యు.సోమేశ్వర రావు శనివారం తెలిపారు. 35–40 సంవత్సరాల వయసు కలిగి, శరీరంపై బిస్కట్ రంగు గీతల చొక్కా ఉందని, కాల్వలో పడి నాలుగు రోజులపైబడి ఉండవచ్చన్నారు. శరీరం బాగా ఉబ్బి, తీవ్ర దుర్వాసన వస్తుండటంతో వీఆర్వో మాబువలి ఫిర్యాదు మేర కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే ఖననం చేయటం జరిగిందన్నారు.

విద్య ద్వారానే అత్యున్నత స్థాయి



సత్తెనపల్లి(ముప్పాళ్ల): సమాజంలో విద్య ద్వారానే అత్యున్నత స్థాయికి చేరగలమని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఒ.జాన్సన్ పేర్కొన్నారు. సత్తెనపల్లిలోని అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో కార్డ్స్ సంస్థ బాలబాట ఆర్గనైజర్ల సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి సంస్థ డీడీ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లకు నెలవారి దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనిత, ఏసీఓ పుల్లారావు, బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ స్టార్



నకరికల్లు: గ్రామాల్లో క్రిస్మస్ సందడి ఆరంభమైంది. క్రైస్తవులు వీధులు, గృహాలపై రంగురంగుల భారీ క్రిస్మస్ స్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీగా ఆర్చీలు ఏర్పాటు చేసి, విద్యుద్దీపాలతో స్టార్లు అలంకరిస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో సీఐ చరణ్, ఎస్‌ఐ వంశీకృష్ణ

నరసరావుపేటటౌన్: గంజాయి విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను శనివారం సీఐ ఎం.వి.చరణ్ వెల్లడించారు. అక్రమంగా గంజాయి కలిగిన కేసులో రెండు నెలల క్రితం ఐదుగురిని అరెస్ట్ చేయగా కేసులో నిందితుడు వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ అష్రఫ్ పరారీలో ఉన్నాడన్నారు. అతని కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో మొదటి రైల్వే గేట్ అంధుల పాఠశాల వద్ద అష్రఫ్ 1350 గ్రాముల గంజాయి, చోరీ చేసిన ద్విచక్ర వాహనంతో పట్టుబడ్డాడన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నిందితుడు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి అమ్మటం వలన ఎక్కువ ఆదాయం వస్తుందని భావించి పట్టణానికి చెందిన షేక్ షరీఫ్, చావపాటి ఉమర్ సాధిక్‌లను కలుపుకొని వైజాగ్ నుంచి వారి సొంత కారులో రహస్యంగా గంజాయిను అక్రమంగా తీసుకొచ్చి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసినట్లు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు బుల్లెట్లు, ఒక పల్సర్, మూడు స్కూటీ వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహన చోరీలకు సంబంధించి యజమానులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇప్పటికే వన్‌టౌన్, టూటౌన్, మంగళగిరి పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయన్నారు. కేసులో ప్రతిభ కనపరిచిన ఎస్‌ఐ పి.వంశీకృష్ణ, సిబ్బంది వీరాంజనేయులు, రాజేష్, కోటేశ్వరరావులను డీఎస్పీ కె.నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ తెలిపారు.

మురిసిన మొక్కజొన్న

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగులో పంట మార్పిడి పాటిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ ఖర్చు, కూలీల అవసరం పెద్దగా లేనందున అటువైపు నాగలి కదలిస్తున్నారు. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుండటంతో మొక్కజొన్న సాగు ఆశాజనకంగా మారింది.

- 'ముప్పాళ్ల'లో 3 వేల ఎకరాల్లో సాగు
- గతేడాది కంటే 1,200 ఎకరాలు అధికం
- రబీలో సాగు దిగుబడిపై రైతుల ఆశలు
- సస్యరక్షణ, కలుపు నివారణ కీలకం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



చాగంటివారిపాలెం సమీపంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

ముప్పాళ్ల: ముప్పాళ్ల మండలంలో మొత్తం 3 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడి అవుతోంది. పైగా చీడపీడల బెడద కూడా అంతగా లేదు. కొన్ని చోట్ల రెండవ పంటగా మొక్కజొన్న సాగు చేస్తుండగా.. మరికొన్ని చోట్ల మొదటి పంటగానే వేస్తున్నారు. గతేడాది కేవలం 1,800 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది నీటి లభ్యత కూడా ఉండటంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగింది.

సస్యరక్షణ చర్యలు...

రబీ మొక్కజొన్న పంటలో ఎక్కువగా గులాబీ కాండం తొలుచు పురుగు రెండు మూడు వరుసల్లో ఆకు మొదలు, కాండం మధ్య గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లు నాలుగైదు రోజుల్లో ఎదిగి పిల్ల పురుగులా మారుతుంది. మొదటి దశలో మొవ్వను రంధ్రం చేసి అంకురానికి చేరడం వల్ల పొడువాటి రంధ్రాలు ఏర్పడతాయి. లార్వాలు ఎదిగే కొద్ది అంకురాన్ని తినడం వల్ల మొవ్వ పాడైపోయి మొక్క చనిపోతుంది. దీని నివారణకు మోనో క్రోటోఫాస్ 1.6మి.లీను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతిని బట్టి 20–25 రోజులకు కార్బోఫ్యూరాన్ 3కిలోల గుళికలు ఎకరాకు వేయాలి. మొక్కకు 6 గుళికలు పడేలా రైతుకు అవగాహన ఉండాలి.

కలుపు నివారణ...

వరి పొలంలో భూమిని దున్నుకోవడం చేయకపోతే కలుపు ఎక్కువగా వస్తుంది. దీని నివారణకు కిలో అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. కోసిన వరి దుబ్బు మొలకెత్తకుండా ఉండటానికి లీటరుకు 5 మి.లీ చొప్పున పారా క్వాట్ మందును నీటిలో కలిపి విత్తిన మరుసటి రోజు పిచికారి చేయాలి. అట్రాజిన్, పారాక్వాట్ కలిపి కూడా పిచికారీ చేయవచ్చు.

ఎనిమిది ఎకరాల్లో సాగు చేశా



రబీలో మొక్కజొన్న సాగు లాభసాటిగా ఉంది. ఈ ఏడాది ఎనిమిది ఎకరాల్లో పంట సాగు చేశా. గతేడాది ఎకరాకు 35 బస్తాల దిగుబడి వచ్చింది. దాళ్వా వరితో పోలిస్తే లాభసాటిగానే ఉంది. అపరాల సాగుకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండటంతోనే మొక్కజొన్న సాగుపై దృష్టి పెట్టా.

–బత్తుల ఏడుకొండలు, రైతు, చాగంటివారిపాలెం

సలహాలు అందిస్తున్నాం



మండంలోని ముప్పాళ్ల, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, రుద్రవరం, మాదల గ్రామాల్లో అధికంగా మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి నానో యూరియా, డీఏపీ వాడకం పట్ల అవగాహన చర్యలు చేపడుతున్నాం.

–ఎం.అరుణ, ఏఓ, ముప్పాళ్ల

భవిష్యత్తు కేంద్రీయ స్థాపనం



ఆకట్టుకున్న విద్యార్థినుల ప్రదర్శన

సత్తెనపల్లి(ముప్పాళ్ల): సత్తెనపల్లిలోని కేంద్రియ విద్యాయంలో 62వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జగదీష్ కుమార్ గుప్త, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్ పాల్గొని, వేడుకలను ప్రారంభించారు. జగదీష్‌కుమార్ గుప్త కేంద్రీయ విద్యాలయాల చరిత్రను, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యాలయాలు విద్యనే కాకుండా సంస్కారంతో కూడిన ఉత్తమ వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. జాన్సన్ మాట్లాడుతూ విద్యార్థులు బహుబాషలను నేర్చుకొని సామర్థ్యాలను పెంచుకునేందుకు విద్యాలయం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. సంఘ కార్యకర్త తోట అంబిక, పాఠశాల పీఈటీ కిరణ్‌రెడ్డి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ జగదీష్‌కుమార్ గుప్త, జాన్సన్

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న బ్యాంక్ మేనేజర్, సంస్థ ప్రతినిధులు

రాజుపాలెం: స్త్రీలు చేతి వృత్తుల ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటూ అబివృద్ధి చెందవచ్చని యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.సైలేష్ భరత్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పథ సేవా సంస్థ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్, పథ సేవా సంస్థ సంయుక్తంగా మహిళలకు సబ్సిడీపై కుట్టు మిషన్లు శనివారం పంపిణీ చేశారు. ముందుగా 60 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అందులో 30 మందికి కుట్టు మిషన్లను సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో పథ సేవా సంస్థ డోనర్ ముర్రే స్మైకాల్, కోఆర్డినేటర్ టి.యోహాన్‌రాజు, పుష్పా సంస్థ బోర్డు మెంబర్ గుమ్మడి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మాల మహానాడు' సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న మాల మహానాడు సభ్యులు

సత్తెనపల్లి(ముప్పాళ్ల): నియోజకవర్గ మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డాక్టర్ ఆంద్రూస్ పాలపర్తి పాల్గొని క్రీస్తు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్‌కుమార్, జిల్లా డీఆర్‌ఓ ఏకా మురళి, జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షు డాక్టర్ గోదా జాన్‌పాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 300 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ దయానందం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్, నాయకులు జ్ఞానరాజ్‌పాల్, మాలే పద్మారావు, ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు మాలె మరియదాసు, యనమాల సింగయ్య, మాతంగి సుధాకర్, మాలే కిరణ్‌కుమార్, కూచిపూడి జానుబాబు, సేవాచంద్ర, మనికె మహేష్, గోదా బాల, కొండ్రు విజయ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు చేసినవారిని కఠినంగా శిక్షించాలి

- సాక్షి విలేకరులపై దాడులకు నిరసన



తహసీల్దార్ దానియేలుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రెస్ క్లబ్ నాయకులు

పెదకూరపాడు: విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పెదకూరపాడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కడప జిల్లా పులివెందులలో సాక్షి విలేకరులపై దాడులకు నిరసనగా శనివారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మీసాలు దానియేలును కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను నివారించేందుకు కఠినచట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిని ఇంతవరకు అరెస్టులు చేయకపోవడం బాధాకరమన్నారు. దాడులు నివారించకపోతే భవిష్యత్తులో జర్నలిజానికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజా సమస్యలను పాలకులు దృష్టికి తీసుకువచ్చే విలేకరులను దాడులు చేసి గాయపరచడం సరికాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు పరగటి రాజు, పర్చూరు పూర్ణచంద్రరావు, అనిల్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గం

19న సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చలమయ్య

సత్తెనపల్లి(ముప్పాళ్ల): విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమని, స్మార్ట్ మీటర్లు పెట్టడం అక్రమమని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. శనివారం పట్టణంలోని పుతుంబాక భవన్‌లో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. స్మార్ట్ మీటర్ల ప్రమాదాలను పలువురు చర్చించారు. ఈ నెల 19న సత్తెనపల్లిలో జరిగే నిరసన ప్రదర్శనలో పెద్ద ఎత్తున ప్రజానీకం పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రాజ్‌కుమార్, పెండ్యాల మహేష్, డీపీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నందిగం చిట్టిబాబు, సీపీఐ నాయకులు ఇర్మియా, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశోక్, సీపీఎం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ, పొట్టి సూర్యప్రకాశరావు, పతంగి ప్రభాకర్, షేక్ సైదులు, గుంటుపల్లి రజిని, గద్దె ఉమాశ్రీ, షేక్ సైదులు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో ఒత్తిడి లేని విద్య



ఉద్యోగ విరమణ చేసిన శేషగిరిరావు, సాంబ శివరావును సన్మానిస్తున్న డీఆర్వో, ప్రిన్సిపల్

నాదెండ్ల: ఒత్తిడి లేని నాణ్యమైన విద్యకు కేంద్రియ విద్యాలయం చిరునామా అని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి, విద్యాలయం నామినీ చైర్మన్ ఏకా మురళి చెప్పారు. ఇర్లపాడు విద్యాలయంలో శనివారం 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎండీ ఫరూక్ పాఠశాల యొక్క వార్షిక నివేదికను వినిపించారు. అనంతరం పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పి.శేషగిరిరావు, సాంబశివరావులను సత్కరించారు. డీఆర్వో మురళీ మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 400 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలకు రూ.38 కోట్లతో నిర్మించిన నూతన భవనాల్లో విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో మెరుగైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నందున జిల్లాలో ఉన్న విద్యాలయాలతో పోటీపడి పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. సుమారు రూ.3 కోట్లతో స్టాఫ్ నివసించేందుకు క్వార్టర్స్ కూడా నిర్మించారన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికలు కావు.. ఎంపికలు

- మొక్కుబడిగా సాగు నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ..
- అధికారులది సైతం ప్రేక్షక పాత్రే..



చామర్రు-2 చైర్మన్‌గా ఎంపికైన పాపిరెడ్డికి డిక్లరేషన్ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

అచ్చంపేట: మండలంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికల నిర్వహణంతా మొక్కుబడిగా జరిగింది. వాస్తవానికి వీటిని ఎన్నికలు అనేదాని కన్నా ఎంపికలు అంటే బాగుంటుంది. మండలంలో వైఎస్సార్ సీపీ ఎన్నికలను పూర్తిగా బాయ్‌కాట్ చేయడంతో కొన్ని సంఘాల్లో తెలుగుదేశం నాయకులే గ్రూపులుగా ఎర్పడి చైర్మన్, ఉప చైర్మన్‌లుగా ఎవరిని ఉంచాలనే విషయంలో తర్జనబర్జన పడ్డారు. చివరికి నియోజకవర్గ బాధ్యులు సూచించిన వ్యక్తికే పట్టం కట్టక తప్పలేదు. ఎట్టకేలకు అధికారులు అధికార పార్టీ సూచించిన వ్యక్తులకు డిక్లరేషన్ పత్రాలు ఇచ్చి, ఎన్నికల ప్రక్రియను మమ అనిపించారు. వరుసగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను పరిశీలిస్తే..

1.పెదపాలెం – నెల్లూరి శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు 2.చింతపల్లి–జమ్మిశెట్టి నాగేశ్వరరావు, షేక్ బాబు 3.చిగురుపాడు– ఆరుద్ర గంగాధర రావు, తిప్పి బాలకోటేశ్వరరావు 4.చామర్రు– రావూరి భద్రయ్య, సూరే పుణ్యవతి 5. చామర్రు ట్యాంక్ – పశుపులేటి పాపిరెడ్డి, కొనకంచి సాయిబాబు 6.అంబడిపూడి– తాళ్లూరి మురళి, బోదెల హనిమిరెడ్డి 7.వేల్పూరు–1–మన్నెం శ్రీనివాసరావు, నల్లపాటి శ్రీనివాసరావు 8.వేల్పూరు–2– కిలారి వెంకటేశ్వరరావు, బొల్లేపల్లి గోవిందు 9.వేల్పూరు–3– కె.గోపి, అన్నం శ్రీనివాసరావు.

ఎన్నిక ఏకగ్రీవం

క్రోసూరు: నాగార్జున సాగర్ కెనాల్స్ క్రోసూరు పరిధిలోని ఆయకట్టు, చెరువు ఆయకట్టు రైతుల నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా, ప్రశాంతంగా జరిగినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసయాదవ్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షలను వివరాలు వెల్లడించారు. క్రోసూరు చెరువు పరిశారాంబాబు, కంబంపాటి కోటేశ్వరరావు, ఇసుక వాగు–6కు వేపూరి శంకరరావు, పగడాల గణయ్య, 88త్యాళ్లూరుకు మాగంటి అప్పారావు, పూలమాల పుల్లారావు, పీసపాడుకు పొన్నెకంటి శివరావు, మక్కెన గంగాధరరావు, ఉయ్యందనకు ఎక్కిటాల విష్ణుమూరి, ఉప్పు శివపార్వతి, ఉయ్యందన డైవర్షన్ చానల్‌కు ఏల్చూరి కల్యాణి, దేవండ్ల శ్రీను, మిట్టపాలేనికి దూళ్ల సాంబశివరావు, మందడపు రామకృష్ణ, అందుకూరుకు దిగుమర్తి తిరుమలరావు, బెల్లంకొండ దుర్గయ్య ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

బహిర్గతమైన వర్గ విభేదాలు

ముప్పాళ్ల: మండలంలోని 9 సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికలన్నీ ఏకపక్షంగా శనివారం ముగిశాయి. వైఎస్సార్ సీపీ ఎన్నికలను బహిష్కరించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులే పదవుల కోసం పోటీ పడ్డారు. అధికారులు కూడా టీడీపీ ముఖ్య నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, వారు చెప్పిన వారికే నీటి తీరువా పన్ను రశీదులు, నో డ్యూస్ సర్టిఫికెట్‌లు అందించారు. 88–ముప్పాళ్ల సాగునీటి సంఘానికి ఇద్దరు అభ్యర్థులు పోటీ పడటంతో టీడీపీ ముఖ్య నేతలు నచ్చజెప్పి ఒక నామినేషన్ విత్‌డ్రా చేయించారు. కొన్ని సంఘాలకు నామినేషన్ వేసేందుకు సభ్యులు లేకుండా పోయారు. సాయంత్రానికి టీడీపీ మద్దతుదారులను వెతికి వారితో నామినేషన్ వేయించి, వారినే అభ్యర్థులుగా ప్రకటించుకోవాల్సిన దుస్థితి అధికార పార్టీకి ఏర్పడింది. కొన్ని చోట్ల ఉన్న వారితోనే సమావేశాలు ముగించి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎంపిక పూర్తి చేశారు.

బయటపడ్డ విభేదాలు..

మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మాదల–3 సాగునీటి సంఘం ఎన్నిక వాయిదా పడింది. అధ్యక్ష పదవి కోసం టీడీపీకే చెందిన ఇద్దరు అభ్యర్థులు పోటీ పడటంతో ఎవరికి మద్దతు ఇవ్వాలో తెలియని గందరగోళ పరిస్థితి సభ్యుల వంతైంది. దీంతో పార్టీలోని అంతర్గత విభేదాలు మరోమారు బహిర్గతమయ్యాయి. పార్టీ ముఖ్య నాయకులు అధ్యక్ష అభ్యర్థిపై సరైన సూచన చేయడం, అభ్యర్థులు సమానంగా ఉండటంతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లుగా ఎన్నికల అధికారి ఎస్.రూపవతి ప్రకటించారు. మొత్తం 8 సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ తెలిపారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

బెల్లంకొండ: ఎర్రబాలెం మేజరు కాలువ పరిధిలో సాగు నీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. మేజర్ కాలువ పరిధిలో 12 మంది మెంబర్లు ఉండగా, రైతులందరూ 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఎర్రబాలెం డీసీ 59వ నీటి సంఘం చైర్మన్‌గా బెల్లంకొండకు చెందిన చేజర్ల ముస్తఫా, వైస్ చైర్మన్‌గా బూతుకూరి గోవిందరెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఏవో హనిమిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన మెంబర్లు, చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఎన్నిక పత్రాలను అందజేశారు. ఎన్నికైన వారిని గుంటూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి సత్కరించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి పీయస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్‌లు గడిపర్తి జ్యోతి సముద్రం, ఆసుల జగన్, అక్కల వెంకట్రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, వెంకటరెడ్డి, సయ్యద్ జబ్బార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా కూడా బయట పెట్టలేదు

పెదకూరపాడు: అందరూ ఊహించినట్లుగానే సాగు నీటి సంఘాల ఎన్నికలు సర్వం ఏకగ్రీవమయ్యాయి. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన ఇరిగేషన్ అధికారులు పలుచోట్ల ఓటర్ల జాబితాను కూడా బయట పెట్టలేదు. పెదకూరపాడు మండలంలో తొమ్మిది సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. బలుసుపాడులో నిర్వహించిన 11వ సాగినీటి సంఘానికి 11 మంది సభ్యులు మాత్రమే నామినేషన్ వేశారు. ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎక్కడా కనిపించలేదు. దీంతో శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. మండలంలోని 100– సాగు నీటి సంఘానికి 12 మంది సభ్యులు నామినేషన్ దాఖలు చేయగా అధ్యక్షుడిగా వేదగిరి రామచంద్రరావు ఏకగ్రీవమయ్యారు. 110 సాగునీటి సంఘానికి భాష్యం శ్రీనివాస్, 111 సంఘానికి యలమంచిలి రామకృష్ణ చౌదరి, 118 సంఘానికి వడ్లమూడి అప్పారావు, 119 సంఘానికి కొమ్మినేని వెంకటేశ్వర్లు, 120 సంఘానికి బోడబాటి బాల రమేష్, 121 సంఘానికి ఓట్లపల్లి నాగేశ్వరరావు, 123 సంఘానికి నంబూరు పుల్లారావు, 124 సంఘానికి మద్దినేని చిన్నారావు ఏకగ్రీవమైనట్లు ఆయా సంఘాలు ఎన్నికల అధికారులు తెలిపారు.



పెదకూరపాడులో నియమకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి శాంతి

నకరికల్లు : సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దారు కె.పుల్లారావు తెలిపారు. గుండ్లపల్లి–1 అధ్యక్షుడిగా బత్తుల చిన అప్పారావు, ఉపాధ్యక్షుడిగా గంగినేని వెంకటరామయ్య, గుండ్లపల్లి –2 అధ్యక్షుడిగా జిలుగు వెంగళరెడ్డి, ఉపాధ్యక్షుడిగా షేక్ సుభాని, ఎర్రనల్ల ట్యాంకు అధ్యక్షుడిగా రుసుం కోటయ్య, ఉపాధ్యక్షుడిగా మర్రివేముల చినబుచ్చారావు, బేతంరాజు ట్యాంకు అధ్యక్షుడిగా సింగోతుల వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా పమ్మి కృష్ణారెడ్డి, చల్లగుండ్ల అధ్యక్షుడిగా మూతి వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా కేతినేని నాగేశ్వరరావు, రూపెనగుంట్ల 1 అధ్యక్షుడిగా తొండపి గురయ్య, ఉపాధ్యక్షుడిగా యండూరి చెంచయ్య, రూపెనగుంట్ల 2 అధ్యక్షుడిగా వడ్లమూడి హనుమంతరావు, ఉపాధ్యక్షుడిగా నరిశెట్టి సుందరరాజు, కుంకలగుంట 1 అధ్యక్షుడిగా కొమ్మూరి కొండలు, ఉపాధ్యక్షుడిగా మిద్దెం లక్ష్మీనారాయణ, కుంకలగుంట 2 అధ్యక్షుడిగా సాతులూరి చినఅప్పారావు, ఉపాధ్యక్షుడిగా కొండపల్లి నాగేశ్వరరావులు ఎన్నికైనట్లు తెలిపారు. నకరికల్లు ఎస్సై చల్లా సురేష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కాశీనాయన ఆరాధన మహోత్సవాలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశీనాయన ఆశ్రమంలో అన్నదాన ప్రభువైన శ్రీశ్రీశ్రీ కాశీనాయన 29వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ చతుర్దశి పౌర్ణమి గడియలలో జ్యోతి ప్రజ్వలన అత్యంత వైభవంగా చేశారు. కాశీనాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్సంగం పారాయణం, భజన నిర్వహించారు. నిత్య అన్నదానంలో 24 గంటల పాటు 108 వంటకాలతో వేలమందికి అన్నసంతర్పణ గావించారు. రాత్రికి బ్రహ్మంగారి పూర్తి నాటకం ప్రదర్శించారు.

నరసరావుపేట: డయల్‌యువర్ డీఎం కార్యక్రమానికి ఒక ఫోన్‌కాల్ వచ్చినట్లు డిపో మేనేజర్ జీఎస్ఎస్ కుమార్ వెల్లడించారు. సత్తెనపల్లి నుంచి అనీల్ ఫోన్‌చేసి నరసరావుపేట నుంచి చెన్నైకు బస్ సర్వీసు నిర్వహించాలని కోరారన్నారు.